# స్వాతంత్ర్యం.. ఎంతోమంది త్యాగఫలం

- మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు



ఖమ్మం, ఆగస్టు 14 : భారతదేశానికి స్వాతంత్ర్యం.. ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితమని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలకుల చేతుల్లో బందీ అయిన మన దేశాన్ని విముక్తి చేయడానికి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టడానికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆ పోరాటవీరులు, జాతీయ ఉద్యమనాయకుల దేశభక్తి వల్లే మనకు స్వాతంత్ర్యం లభించిందని పేర్కొన్నారు. తెల్లదొరల బానిసత్వపు సంకెళ్ల నుంచి యావత్తు భారతజాతికి స్వేచ్ఛను అందించిన ఈ శుభదినం మన అందరికీ గర్వకారణమన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటానికి నాటి స్వాతంత్ర్య పోరాటమే స్ఫూర్తి అని పేర్కొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేడు ముఖ్యమంత్రి పర్యటన

- పలుచోట్ల 'సీతారామ' పంప్‌హౌజ్‌లు ప్రారంభం
- వైరాలో భారీ బహిరంగ సభ
- రైతు రుణమాఫీ మూడో విడత విడుదల



ఖమ్మం, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు వరప్రదాయినిగా నిర్మాణంలో ఉన్న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పలుచోట్ల పంప్‌హౌజ్‌లను ప్రారంభించి వైరాలో ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగు నీటిని విడుదల చేయనున్నారు. అదేవిధంగా వైరా వేదికగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం హైదరాబాద్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఉదయం 11:45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ సీఎం రేవంతరెడ్డి సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌజ్-2ను ప్రారంభించి పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. ముఖ్యమంత్రితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరుకానున్నారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద ఏర్పాటుచేసిన మరో పంపుహౌజ్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో నిర్మించిన పంప్‌హౌజ్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభిస్తారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొని అక్కడే మీడియా సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం అక్కడి నుంచి 2:15 గంటలకు రెండు హెలికాప్టర్ల ద్వారా నియోజకవర్గ కేంద్రమైన వైరాకు చేరుకుంటారు. అక్కడ రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ మూడోవిడత కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఈ సందర్భంగా వేదికపైన పలువురు రైతులకు రుణమాఫీకి సంబంధించిన చెక్కులను అందించనున్నారు. అనంతరం కార్యక్రమాలను ముగించుకుని సాయంత్రం 4:45 గంటలకు వైరా నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పోలీస్ అధికారులు భారీ బందోబస్తుతో భద్రతా ఏర్పాట్లు చేశారు.

# సీతారామ.. కేసీఆర్ మానస పుత్రిక

- ఈ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- జిల్లాలోని ముగ్గురు మంత్రులది గోబెల్స్‌ను మించిన ప్రచారం
- నేటి వైరా సభలో జిల్లా ప్రజలకు సీఎం వాస్తవాలు చెప్పాలి
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

ఖమ్మం, ఆగస్టు 14 : భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ఉద్యమ సారథి కేసీఆర్ మానసపుత్రిక అని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ఆయనే స్వయంగా రూపకల్పన చేసి నిర్మించిన ఎత్తిపోతల పథకం సీతారామ అని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీలేదని స్పష్టం చేశారు. కానీ.. కేసీఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్టును వారి ప్రభుత్వం నిర్మించినట్లుగా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చెప్పుకుంటుండడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరాలో గురువారం జరిగే సభలో సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పులు మాట్లాడినట్టుగా కాంగ్రెస్ మంత్రులు ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. కానీ.. హరీశ్‌రావు మాటల్లో తప్పేముందని ప్రశ్నించారు. 'సీతారామ ప్రాజెక్టుకు డిజైన్ చేసిందెవరు? కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ఎంత? కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర ఎంత? సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్న మూడు మోటర్లు బిగించింది బీఆర్ఎస్ ప్రభుత్వమా? కాంగ్రెస్ ప్రభుత్వమా?' వంటి అనేక విషయాల గురించి ఉమ్మడి జిల్లా ప్రజలకు వాస్తవాలు వెల్లడించాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తాము చేసినట్టుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు.. ఉమ్మడి జిల్లా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

## గ్యారెంటీ హామీలకు దిక్కులేదు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు పూర్తవుతున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన గ్యారెంటీ హామీలకూ దిక్కులేదని తాతా మధు విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆ మరుసటి నెల నుంచే పెంచిన పింఛన్‌ను కలిపి ఒకేసారి పంపిణీ చేస్తే.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 8 నెలలు అవుతున్నా పింఛన్లు పెంచకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. అనేక బృహత్తర పథకాలను అటకెక్కించిందని ఎద్దేవా చేశారు. ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పూర్తిస్థాయిలో మాఫీ చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 40 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని విమర్శించారు. కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగమని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ మంత్రులు గోబెల్స్‌ను మించారు: కమల్‌రాజు

బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని తాము చేసినట్లుగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు.. బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారం చేయడంలో ఏకంగా గోబెల్స్‌నే మించిపోయారని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సీతారామ ప్రాజెక్టును తాము పూర్తి చేసినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు, తాజుద్దీన్, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పూసుగూడెంలో సీఎంకు బుద్ధి చెబుదాం

- జిల్లా మేలు కోసం రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- పినపాక నియోజకవర్గంపై ముఖ్యమంత్రిది సవతితల్లి ప్రేమ
- అందుకే ఇక్కడ అడుగు పెట్టకుండా పూసుగూడెం వెళ్తున్నారు..
- 'సీతారామ' నీళ్లను ఇక్కడి రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు
- ఖమ్మం మంత్రులు వారి నియోజకవర్గాలకు తీసుకెళ్లడమేంటి?
- మణుగూరు ధర్నాలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా



ర్యాలీ నిర్వహిస్తున్న భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు,నాయకులు

మణుగూరు టౌన్, ఆగస్టు 14 : భద్రాద్రి జిల్లా రైతులకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి పూసుగూడెంలో బుద్ధిచెబుతామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. జిల్లా మేలు కోసం రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సాక్షాత్తూ సీతారామ ప్రాజెక్టు ఉన్న పినపాక నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇక్కడి రైతులకు గోదావరి జలాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇక్కడి రైతులు నిలదీస్తారన్న భయంతోనే ఆయన పూసుగూడెం వెళ్తున్నారని విమర్శించారు. భద్రాద్రి జిల్లాలోని పినపాక నియోజకవర్గానికి చెందిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను ఇక్కడి రైతులకు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు వారి నియోజకవర్గాలకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండడాన్ని నిరసిస్తూ భద్రాద్రి జిల్లా మణుగూరులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును దాదాపు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రారంభానికి సిద్ధంగా ఈ ప్రాజెక్టును ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ మంత్రులు సీఎంతో ప్రారంభింపజేసుకొని గోదావరి నీళ్లను వారి నియోజకవర్గాలకు తీసుకెళ్లాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ ప్రకారం స్థానిక రైతులకు, ముఖ్యంగా భద్రాద్రి జిల్లా రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.8 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ ప్రభుత్వం నిర్మిస్తే.. కేవలం రూ.70 కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులకు తుది మెరుగులు దిద్దిందని అన్నారు. ఇప్పుడు కృష్ణా జలాలు పారే సాగర్ కాల్వలకు లింక్ కెనాల్ ద్వారా సీతారామ నుంచి వెళ్లే గోదావరి నీళ్లను మళ్లిస్తున్నారని అన్నారు. ఇలా మళ్లించడమంటే భద్రాద్రి జిల్లా రైతులకు పూర్తిగా అన్యాయం చేసినట్లేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, కుంట లక్ష్మణ్, వేముల లక్ష్మయ్య, ముద్దంగుల కృష్ణ, యాదగిరిగౌడ్, ఏనిక ప్రసాద్, కోడి అమరేందర్, జాలె రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి రమణారెడ్డి, సానికొమ్ము శంకర్‌రెడ్డి, లక్ష్మి చైతన్య రెడ్డి, సాయిబాబా, చుక్కపల్లి బాలాజీ, బొల్లు సాంబ, సంగ్గి సురేశ్ పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 14 : అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) ఇప్పించారు. ఎంపీ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన నిరుపేద దుబ్బాక రవి 22 ఏళ్ల కుమారుడు రణధీర్ అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంపీ వద్దిరాజు సిఫార్సు లేఖను అధికారులు పరిశీలించి రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేశారు. ఆ ఎల్‌వోసీ పత్రాన్ని రణధీర్ తండ్రి రవికి హైదరాబాద్‌లో బుధవారం ఎంపీ రవిచంద్ర అందజేశారు. ఎంపీ వద్దిరాజుకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

# అధ్వానపు రోడ్డును బాగు చేయాలని ఆందోళన

- రోడ్డుపై బైఠాయించిన శేషగిరినగర్ కాలనీవాసులు
- మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం



కాలనీవాసుల ఆందోళనతో రోడ్డుపై నిలిచిన వాహనాలు

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 14 : అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారిని మరమ్మతు చేయాలని లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ పోస్టాఫీస్ సెంటర్ నుంచి కొత్తగూడెం-ఇల్లెందు వెళ్లే బైపాస్ రోడ్డుపై తారు కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయని, తరచూ ప్రమాదాలు జరగడంతో వాహనదారులు తీవ్ర గాయాల పాలవుతున్నారని, దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మార్గంలో నిత్యం సింగరేణి బొగ్గు టిప్పర్లే ఎక్కువగా వెళ్తున్నాయని, ఈ విషయంలో ఆర్అండ్‌బీ, సింగరేణి అధికారులు స్పందించి మరమ్మతులకు పూనుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు రోడ్డు అధ్వానంగా మారిందని, దీనిని కూడా మరమ్మతు చేయాలని వారు కోరారు. ఆందోళనలో కాలనీవాసులతోపాటు మాజీ సర్పంచ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# 'సీతారామ' నీళ్లు వచ్చేంత వరకు ఉద్యమిస్తాం..



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న హరిప్రియానాయక్, లక్కినేని, నాయకులు

## నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు ఇవ్వాలి..

## ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, డీటీకి వినతి

టేకులపల్లి, ఆగస్టు 14 : నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీరు వచ్చేంతవరకు ఉద్యమిస్తామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌లు మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా మీదుగా గోదావరి నది ప్రవహిస్తుండడంతో ఆ నీటిని వినియోగంలోకి తేవడంతోపాటు జిల్లాలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో గత సీఎం కేసీఆర్ ముందస్తు ఆలోచనతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసి నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రులు తమ స్వార్థం కోసం సీతారామ నీటిని భద్రాద్రి జిల్లాకు కాకుండా.. ఖమ్మం జిల్లాకు తరలించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి నీటిని పక్క జిల్లాకు తరలిస్తే ఎవరూ చూస్తూ ఊరుకోరని, రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ ఉద్యమాలు చేస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోడ బాలు, తాతా గణేశ్, బానోత్ రామ, కిషన్, జాలాది అప్పారావు, లాలు, కిరణ్, శివకృష్ణ, రవి, లచ్చు పాల్గొన్నారు.












































